ఐడీఎస్ఎంటీ.. కథేంటి!

- 36 ఏళ్లుగా మున్సిపాలిటీ నిర్లక్ష్యం
- విక్రయానికి నోచుకోని 94 ప్లాట్లు
- విక్రయిస్తే మున్సిపాలిటీకి రూ.కోట్ల రాబడి
- ఈ లేవుట్‌లో అటకెక్కిన అభివృద్ధి

కావలి మున్సిపాలిటీ అధికార వ్యవస్థ నిర్లక్ష్యానికి ఐడీఎస్ఎంటీ అద్దం పడుతోంది. స్థానిక సంస్థలు రాబడి వచ్చే మార్గాలను అన్వేషిస్తుంటాయి. కానీ కావలి మున్సిపాలిటీ చేతిలో రూ.కోట్ల రాబడి వచ్చే అవకాశాన్ని మూడున్నర దశాబ్దాలుగా నిర్లక్ష్యం చేస్తోంది. ఎంతో మంది అధికారులు వచ్చారు.. పోయారు. ఎన్నో పాలక వర్గాలు వచ్చాయి.. పోయాయి. అయితే ఐడీఎస్ఎంటీ పట్టిన గ్రహణం మాత్రం వీడలేదు. ప్రతిష్టాత్మకమైన లేవుట్‌లో ప్లాట్లు కొంటే సకల సౌకర్యాలు ఏర్పడుతాయని భావించిన యజమానులకు సకల పాట్లు తప్పడం లేదు.

కావలి: అధికారుల నిర్లక్ష్యం.. పాలక వర్గాల అలక్ష్యం కావలిలోని ఐడీఎస్ఎంటీ (ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం టౌన్స్)కి 36 ఏళ్లుగా గ్రహణం పట్టింది. రూ.కోట్ల ఆస్తులు నిరుపయోగంగా ఉన్నాయి. పట్టణాలను విస్తరింపచేయాలనే సంకల్పం, పట్టణాల్లో ప్రజలకు నివాస యోగ్యమైన కాలనీలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో 1987లో కావలిలో ఐడీఎస్ఎంటీ లేఅవుట్ ఏర్పాటు చేసింది. పట్టణాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు దోహదపడే ఇంటి నివాస స్థలాలు సమకూర్చడంతో పాటు, మున్సిపాలిటీలకు ఆర్థిక పరిపుష్టిని కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఈ ఐడీఎస్ఎంటీ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చి ప్రోత్సహించింది.

కావలి పట్టణంలో సర్వే నంబర్ 2082/2లో ఉన్న అటవీశాఖ భూమిలో ఉన్న 40 ఎకరాలను ఈ పథకం కింద సేకరించి ఇంటి స్థలాలుగా లేఅవుట్ వేసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకం కావడంతో అటవీశాఖ నుంచి అప్పట్లో అన్ని అనుమతులు శరవేగంగా వచ్చాయి. దీంతో 40 ఎకరాల లేఅవుట్‌లో 20.65 ఎకరాలు ఇంటి నివాస స్థలాలుగా, 46 సెంట్లు వాణిజ్య అవసరాల కోసం, 2.67 ఎకరాలు స్కూల్, పోస్టాఫీస్, ఆస్పత్రి, కమ్యూనిటీ హాలు నిర్మాణాల కోసం, 3.70 ఎకరాలు పార్కులు, ఆట స్థలం కోసం, 12.52 ఎకరాలు రోడ్ల కోసం కేటాయించారు.

నాలుగు కేటగిరీల్లో 475 ప్లాట్లు

నివాసానికి అవసరమైన 20.65 ఎకరాల స్థలంలో నాలుగు కేటగిరీల్లో లేఅవుట్ వేశారు. హై ఇన్‌కం గ్రూపు (హెచ్ఐజీ) కేటగిరీలో (50 అంకణాలు) 44 ప్లాట్లు, మీడియం ఇన్‌కం గ్రూపు (ఎంఐజీ) కేటగిరీలో (37.5 అంకణాలు) 88 ప్లాట్లు, లోయర్ ఇన్‌కం గ్రూపు (ఎల్ఐజీ) కేటగిరీలో (33.33 అంకణాలు) 123 ప్లాట్లు, ఎకనామికల్లి వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యూస్) కేటగిరీలో 11.11 (అంకణాలు) 214 ప్లాట్లుగా మొత్తం 475 ప్లాట్లను సిద్ధం చేశారు. ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా అమ్మకాలు చేపట్టారు. ఇందుకు కోసం మున్సిపాలిటీలో రూ.500 చలానా చెల్లించి దరఖాస్తు చేసుకుంటే మార్కెట్ ధరను అనుసరించి మున్సిపాలిటీ నిర్దేశించిన ధరలు ప్రకారం ప్లాట్లు విక్రయించాలని నిర్ణయించారు. అయితే అప్పట్లో దరఖాస్తుదారులు ఎక్కువ రావడంతో లాటరీ ప్రక్రియ ద్వారా ప్లాట్లను కేటాయించారు. ఆ మేరకు వారికి మున్సిపాలిటీ రిజిస్ట్రేషన్లు చేసింది. ఈ విధంగా 1997 వరకు 381 ప్లాట్లను విక్రయించగా ఇంకా 94 ప్లాట్లు మిగిలి పోయాయి.

14 ప్లాట్లకు రిజిస్ట్రేషన్ పెండింగ్

అయితే ఇందులో మరో 14 ప్లాట్లకు సంబంధించి లాటరీలో స్థలాలు పొంది.. మున్సిపాలిటీ నిర్ణయించిన ధర మొత్తాన్ని కూడా మున్సిపాలిటీకి పూర్తిగా చెల్లించారు. అయితే మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం వల్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ఈ నిర్దేశిత నగదు చెల్లించినా వారికి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా ముప్పతిప్పలు పెడుతున్న మున్సిపాలిటీ ఎప్పటికప్పుడు వీలు చూసుకుని రిజిస్ట్రేషన్లు చేస్తామని దాటవేత ధోరణిని అవలంబిస్తూ దశాబ్దాల కాలాన్ని గడిపేసింది. ఇక మిగిలిన 80 ప్లాట్లకు కొనుగోలుదారులను ఎంపిక చేయకుండా వదిలేశారు. మున్సిపాలిటీ వద్ద 265 మంది దరఖాస్తుదారుల జాబితా 36 ఏళ్లగా పెండింగ్‌లో ఉంది.



ఐడీఎస్ఎంటీలో రోడ్లు లేని వీధులు



లేఅవుట్ ప్లాన్

అభివృద్ధి పనులకు తిలోదకాలు

ప్రజల డబ్బుతో వారికి ఇంటి స్థలాలు, అన్ని రకాల సదుపాయాలు కల్పించడం ఐడీఎస్ఎంటీ లక్ష్యం. అయితే ప్రధానంగా ఈ ప్రక్రియ ద్వారా మున్సిపాలిటీకి ఆర్థిక వనరులు సమకూరడంతో పాటు, అక్కడ నివాసం ఏర్పరచుకునే నిర్మాణాల ద్వారా పన్నుల రూపేణా మున్సిపాలిటీకి శాశ్వత ఆర్థిక పరిపుష్టి లభిస్తోంది. అయితే కావలి మున్సిపాలిటీ ఈ లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేసింది. మున్సిపాలిటీ వద్ద మిగిలి ఉన్న 80 ప్లాట్లను విక్రయించినా కోట్లాది రూపాయల నిధులు సమకూరుతాయి. వీటిని గాలికి వదిలేయడంతో ఇప్పటి వరకు ఐడీఎస్ఎంటీ లేఅవుట్‌లో రోడ్లు, కాలువలు, తాగునీటి వంటి ప్రధానమైన సౌకర్యాలు కల్పించలేదు. ఆట స్థలం, పార్కులు వంటివి నిర్మించలేదు. పాఠశాల, ఆడిటోరియం, పోస్టాఫీస్‌ల ఊసేలేదు. కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ స్థలం ఆక్రమణలకు గురైంది.

అనుమతుల కోసం ప్రతిపాదనలు

కావలిలోని ఐడీఎస్ఎంటీ లేఅవుట్ విషయం నా దృష్టికి వచ్చింది. తాజా పరిస్థితులపై ఉన్నతాధికారుకు నివేదిక పంపించాం. అక్కడి నుంచి అనుమతులు రాగానే చర్యలు తీసుకుంటాం.

– బాబురావు, టౌన్ ప్లానింగ్ అధికారి, కావలి మున్సిపాలిటీ

క్లుప్తంగా

నేటినుంచి మహాలక్ష్మమ్మ తిరునాళ్ల



ముస్తాబైన మహాలక్ష్మమ్మ ఆలయం

కలిగిరి: కలిగిరి గ్రామదేవత మహాలక్ష్మమ్మ తిరునాళ్ల సోమ, మంగళవారాల్లో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం సుప్రభాతసేవ, గణపూజ, అమ్మవారికి పాలాభిషేకం, అన్నదాన కార్యక్రమాలు చేపడుతారు. మంగళవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, కుంకుమార్చన కార్యక్రమాలు, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

వైభవంగా ముగిసిన మానసాదేవి బ్రహ్మోత్సవాలు



కుంకుమ పూజ నిర్వహిస్తున్న మహిళలు

వరికుంటపాడు: మండలంలోని తూర్పు రొంపిదొడ్లలో కొలువైన మానసాదేవి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి వాల్మీకి పూజ, సహస్రనామార్చన, కుంకుమ పూజ తదితర విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. చల్లా వంశస్తుల ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలకు వలసవాసులు రావడంతో గ్రామంలోని కుటుంబాల్లో సందడి నెలకొంది.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు ఇక్బాల్

వరికుంటపాడు: వరికుంటపాడు నూతన తహసీల్దారుగా సయ్యద్ ఇక్బాల్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. బాపట్ల జిల్లా నిజాంపట్నం తహసీల్దారుగా పని చేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. అందరి సహకారంతో ఆదర్శ రెవెన్యూ మండలంగా తీర్చిదిద్దుతానన్నారు.

కోన కాలువకు మరమ్మతులు



మరమ్మతు పనులు చేస్తున్న కూలీలు

ఉదయగిరి: ఉదయగిరి దుర్గం పైనుంచి పట్టణ వాసులకు దాహార్తి తీర్చే సకల ఔషధ గుణాల కలిగిన జలాలు పారే కోనకాలువకు ఆదివారం పంచాయతీ ఈఓ నరసయ్య ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. ప్రస్తుతం కాలువ అక్కడక్కడ దెబ్బతిని నీరు వృథాగా పోతోంది. కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి నీటి సరఫరా దిగువ ప్రాంతానికి సక్రమంగా రాకపోవడంతో కోన నీటికోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పంచాయతీ పాలకులు స్పందించి కాలువకు మరమ్మతులు చేపట్టి నీరుసక్రంగా దిగువకు వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి



పోలీసుల అదుపులో పేకాట రాయుళ్లు

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలం ఆమని చిరువెళ్ల పొలాల్లో ఉన్న ఈతతోపులో పేకాట ఆడుతున్న వారిపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాటాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.14,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సి సంతోష్‌రెడ్డి ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నట్టల నివారణ కార్యక్రమం వాయిదా

వరికుంటపాడు: మండలంలో ఈ నెల 16 నుండి 25వ తేదీ వరకు నిర్వహించాల్సిన నట్టల నివారణ ఉచిత మందు పంపిణీ కార్యక్రమం పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్‌వీఎస్ రాఘవేంద్రశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం తిరిగి ఎప్పుడు నిర్వహించేది జీవాల, పశుపోషకులకు తెలియజేస్తామన్నారు.

పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రజలకు చేరువయ్యేలా సమష్టిగా పనిచేద్దామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయాధికారులు, విద్యాశాఖ అధికారులతో సమావేశాన్ని నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీలు.. అర్హులై సంక్షేమ పథకాలు అందని వారి వివరాలపై సమీక్ష సమావేశాలను నిర్వహించి వాటిని పరిష్కరించాలని సూచించారు. ఆత్మకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళాను ఈ నెల 24న నిర్వహించనున్నామని, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రతిష్టాత్మకంగా మున్సిపల్ బస్టాండ్ ప్రారంభం

ఆత్మకూరులో నిర్మించిన ఎమ్జీఆర్ మున్సిపల్ బస్టాండ్‌ను ఈ నెల 23న ప్రారంభించనున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులతో సమావేశాన్ని నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ఆత్మకూరులో సర్వాంగ సుందరంగా నిర్మించాలనుకున్న మున్సిపల్ బస్టాండ్ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి హఠాన్మరణంతో నిలిచిపోయిందన్నారు. ఈ క్రమంలో తమ సొంత నిధులతో ఎమ్జీఆర్ ఫౌండేషన్, ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా నిర్మించామని తెలిపారు. బస్టాండ్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలన్నారు.

ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో టాపర్



సొనా సాయి శ్రీవాత్సవ రెడ్డి

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లికి చెందిన సొనా సాయి శ్రీవాత్సవ్‌రెడ్డి ఆదివారం ప్రకటించిన ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 896 ర్యాంకు సాధించారు. ఇతని సోదరుడు విష్ణు కార్తికేయరెడ్డి మూడేళ్ల క్రితం ఐఐటీ ఫలితాల్లో మెరుగైన ర్యాంకు సాధించి ప్రస్తుతం వారణాసి ఐఐటీ (బీహెచ్‌యూ)లో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. శ్రీవాత్సవ్ తల్లి గీత తురిమెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తుండగా, తండ్రి సొనా నాగమోహన్ రెడ్డి పొదలకూరు మండలం తాటిపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు.

20న క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశానికి మండల స్థాయి ఎంపికలు ఈ నెల 20న మర్రిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మాలకొండలరావు, పాఠశాల హెచ్‌ఎం పద్మప్రియ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతిలో ప్రవేశానికి 8–9 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలని, 5వ తరగతిలో ప్రవేశానికి 9–10 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. రాష్ట్రస్థాయిలో బాలబాలికలకు 20 చొప్పున 40 సీట్లు, 5వ తరగతిలో బాలురుకు 7, బాలికలకు 4 సీట్లు ఉన్నాయన్నారు. ఎంపికలు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మూడు దశల్లో ఉంటాయన్నారు. ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు మర్రిపాడు జెడ్పీ హైస్కూల్ పీఈటీ హరనాథ్, 95737 30833లో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సత్కరించిన విద్యార్థులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని కొత్త అల్లంపాడు ప్రాథమిక పాఠశాలలో 8 ఏళ్లుగా పనిచేస్తూ బదిలీపై ఆత్మకూరు మండలంలోని మహిమలూరు, పేరారెడ్డిపల్లి పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు షేక్ ఖాజారసూల్, నాటకం కామేశ్వరిలను ఆదివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఘనంగా సత్కరించి వీడ్కోలు తెలిపారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ షఫీ, మౌలాలి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

యువతకు ఎమ్మెల్యే మేకపాటి ప్రోత్సాహం

సంగం: ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి యువతను క్రీడలు, విద్యలో ప్రోత్సహిస్తున్నారు. ఆదివారం అన్నారెడ్డిపాళెం సచివాలయం పరిధిలోని మక్తాపురంలో పర్యటిస్తున్న సందర్భంగా అంబేడ్కర్ కబడ్డీ టోర్నమెంట్ జరుపుకోవాలని, నగదు ప్రోత్సాహకం అందించాలని ఎమ్మెల్యే మేకపాటి దృష్టికి యువత తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మేకపాటి రూ.20 వేలు నగదు టోర్నమెంట్ విజేతకు అందజేస్తానని వారికి హామీ ఇచ్చారు.

జేబీ కళాశాలలో అడ్మిషన్స్ ప్రారంభం

కావలి: కావలిలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి సోమవారం నుంచి అడ్మిషన్స్ ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే రాజగోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు కళాశాలకు వచ్చి అడ్మిషన్స్ పొందాల్సిందిగా సూచించారు.

నిమ్మ, టేకు చెట్లు దగ్ధం



తగలబడిన నిమ్మ, టేకుచెట్లు

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ చంద్రారెడ్డిపాళెంలో వంటేరు ప్రసాద్‌కు చెందిన నిమ్మచెట్లు, టేకుచెట్లు ఆదివారం దగ్ధమయ్యాయి. బాధితుడి సమాచారం మేరకు.. నిమ్మతోట సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. అగ్నిప్రమాదంలో 150 టేకుచెట్లు, 52 నిమ్మచెట్లు దగ్ధమయ్యాయి. చెట్లకు నీటిని అందించడానికి అమర్చిన సుమారు రూ. 50 వేలు విలువైన డ్రిప్‌పైపులు, పరికరాలు కూడా బుడిదయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ. 7 లక్షల మేర నష్టం వాటినట్లు బాధితుడు తెలిపాడు.

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు



జేసీబీతో కంపచెట్లు తొలగిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని 3వ వార్డు పరిధి ఆత్మకూరు–నెల్లూరుపాళెం రహదారికి సమీపంలో ఉన్న హిందూ శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. పలువురు దాతల సహకారంతో మాజీ కౌన్సిలర్ షేక్ సందానీ తదితరులు ఈ పనులు పర్యవేక్షిస్తున్నారు. 'స్వర్గధామం' పేరుతో శ్మశాన వాటికలో లోపలి వైపు కంప చెట్లు, చెత్తాచెదారం జేసీబీతో తొలగించారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు వచ్చే వారు కూర్చోనేందుకు వేపచెట్టు అరుగు నిర్మాణం పూర్తి చేశారు. దాతలు చంద్రశేఖర్, శేషయ్య, సాయిబాబా సహకరించారని సందానీ బాషా తెలిపారు.

జగనన్న సురక్షలో ధ్రువీకరణ పత్రాలు



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- అన్నారెడ్డిపాళెం, మక్తాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

సంగం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈ నెల 23 నుంచి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారని, ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వలంటీర్, సంబంధిత అధికారి వెళ్లి ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చెప్పారు.నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారం మండలంలోని అన్నారెడ్డిపాళెం సచివాలయం పరిధిలోని అన్నారెడ్డిపాళెం ఎస్సీ కాలనీ, మక్తాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యేకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, మక్తాపురం మోహన్‌రెడ్డి, సర్పంచ్ పూనేటి అనూష, ఫణికుమార్‌రెడ్డి దంపతులు ఘన స్వాగతం పలికారు. అన్నారెడ్డిపాళెంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ లబ్ధి కరపత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మేకపాటి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే 60 సచివాలయాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించామని, పలు గ్రామాల్లో ప్రజలు చిన్నచిన్న కారణాలతో తమకు సంక్షేమ పథకాలు అందడం లేదని తమ దృష్టికి తీసుకొస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ పత్రాలు, ఆధార్ కార్డుల్లో మార్పులతో పింఛన్లు రాకపోవడం వంటి కారణాలను తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. వీటిన్నింటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని ఈ నెల 23 నుంచి వచ్చే నెల 23 వరకు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ అప్‌డేషన్ సైతం సంబంధిత వలంటీర్ ఇంటికి వచ్చి ఎటువంటి రుసుం లేకుండా చేసి వెళ్తారని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగనన్న ఏం చేసినా ప్రతిపక్ష పార్టీలు బురద జల్లేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని దుయ్యబట్టారు. అరుంధతీయవాడలో అగ్నిప్రమాదంతో కట్టుబట్టలతో మిగిలిన బోడేద్దల పెంచలమ్మ, శీనయ్య దంపతులకు ఆర్థిక సాయం అందజేశారు.ప్రభుత్వం తరఫున సహాయం అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రావుల లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ దేవసహాయం, వైఎస్సార్‌సీపీ నేతలు కంటాబత్తిన రఘునాథరెడ్డి, మెట్టుకూరు వాసుదేవరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, సర్పంచ్‌లు కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి, ఆనం ప్రసాద్‌రెడ్డి, మానికల చందు, సుధాకర్‌రెడ్డి, కరిముల్లా, పట్టాభి, శంకరయ్య, కొల్లి శ్రీధర్‌రెడ్డి, రాము తదితరులు ఉన్నారు.

ముగిసిన మహాలక్ష్మమ్మ తిరునాళ్ల



ప్రత్యేకాలంకరణలతో బండ్లు పొంగళ్లకు వెళ్తున్న గ్రామస్తులు

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రం పంచాయతీ చౌటపల్లెలో కొలువైన మహాలక్ష్మమ్మ అమ్మవారి ఉత్సవాలు మూడో రోజు ఆదివారం వైభవంగా ముగిసినాయి. ఈ సందర్భంగా పంచాయతీ ప్రజలు పెద్ద ఎత్తున బండ్లు కట్టుకుని గుడి వద్దకు చేరుకుని ప్రదక్షిణలు చేశారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవాల్లో ఉదయగిరి మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల సుబ్బారెడ్డి ఎడ్లబండి కట్టుకుని ఆలయానికి చేరుకుని నియోజకవర్గ ప్రజలు మహాలక్ష్మమ్మ దయతో సుఖ సంతోషాలు, ఆయు రారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంక్షేమ పాలనకు చేయూతనివ్వండి



కరటంపాడులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందిస్తున్న మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర

ఆత్మకూరురూరల్: అర్హతే ప్రామాణికంగా కులాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరు అండగా నిలబడి చేయూతనివ్వాలని ఆత్మకూరు మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర కోరారు. మండలంలోని కరటంపాడు పంచాయతీలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి తిరిగి కుటుంబాల వారీగా ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు. ఒక్కో కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు ప్రభుత్వం వివిధ పథకాల నుంచి సంక్షేమ ఫలాలు అందాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నెట్టెం పిచ్చయ్యనాయుడు, ఖాసీంఖాన్, శేషయ్యనాయుడు, తిరుమల, రఫీ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ స్టాఫ్ మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

కావలి: కావలిలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ నేత వై.తారకనాథ్ 19వ వర్ధంతిని పురస్కరించుకుని సిబ్బంది ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్యాంక్ చీఫ్ మేనేజర్ దీపక్, రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్, జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ సుధీర్‌నాయుడు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పట్టణంలోని మూడు బ్రాంచ్‌ల ఎస్‌బీఐ ఉద్యోగులతో పాటు ఖాతాదారులు పలువురు రక్తదానం చేశారు. మొత్తం 121 మంది రక్తదానం చేసి అభినందనలు అందుకున్నారు. రక్తదాతలను ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు, యూనియన్ లీడర్లు కేవీఎస్ఎన్ మూర్తి, ప్రసాద్, సనత్ కుమార్, గిరిధర్ అభినందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కనుమర్లపూడి వెంకటనారాయణ, ఎస్‌బీఐ ఉద్యోగులు, టీం సేవియర్స్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి ఎంఈఓగా కరటంపాడు హెచ్‌ఎం



తోట శ్రీనివాసులు

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట శ్రీనివాసరావు ఉదయగిరి ఎంఈఓగా ఆదివారం నియమితులయ్యారు. ఆత్మకూరుకు చెందిన శ్రీనివాసులు కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండేళ్లగా ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మన్ననలు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పక్షవాత మహిళకు ఆర్థిక సహాయం

సంగం: మండలంలోని మక్తాపురం బీసీ కాలనీకి చెందిన ఆలపాక లక్ష్మి పక్షపాతంతో బాధపడుతున్నానని, వైద్యానికి కూడా ఇబ్బందిగా ఉందని, పింఛను రావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ.10 వేలు చెక్‌ను ఆమెకు అందజేసి వైద్య ఖర్చులకు ఉంచుకోవాలని, పింఛన్ వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

అంకాలమ్మ, పోలేరమ్మకు పాలపొంగళ్లు



ప్రత్యేకాలంకరణలో అంకాలమ్మ, పోలేరమ్మ తల్లి

దుత్తలూరు: మండలంలోని నందిపాడులో కొలువైన గ్రామదేవతలైన అంకాలమ్మ, పోలేరమ్మ దేవతకు ఆదివారం భక్తులు పాలపొంగళ్లు నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. నందిపాడు, పాపంపల్లి, రెడ్లదిన్నె, బొటికర్లపాడు, శ్రీరాంనగర్, శ్రీకృష్ణనగర్ నుంచి భక్తులు డప్పు వాయిద్యాల నడుమ ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం పొంగళ్లు పొంగించి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నారు.